**WANTED**

అనతి కాలంలోనే అశేష ప్రజాదరణ పొందిన తెలంగాణ చౌరస్తా డిజిటల్ దినపత్రికకి సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లో నియోజకవర్గాల వారిగా రిపోర్టర్స్ కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రియార్టీ ఉంటుంది

సంప్రదించాల్సిన నెంబర్లు:

8328571871, 8897273714



# తెలంగాణ చౌరస్తా


Voice Of Democracy

epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

సంపుటి: 01 సంచిక:198

24 క్యారెట్లు 1,61,890.00 | కిలో వెండి 2,95,000.00 | tcnewsdaily | 26.02.2026 గురువారం, హైదరాబాద్



## పి.సి.ఘోష్ కమిషన్ చెల్లదు

- కమిషన్ ఇచ్చిన రిపోర్టును కొట్టేయాలి
- విచారణ తీరు చట్టబద్ధంగా లేదు
- కేసీఆర్ కీర్తిప్రతిష్టలను దెబ్బతీసేలా కుట్ర
- క్యాబినెట్ ఆమోదం మేరకే ప్రాజెక్టు నిర్మాణం
- హైకోర్టులో కేసీఆర్, హరీశ్ లాయర్ల వాదనలు
- గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పొడగింపు
- ఈ నెల 27కి విచారణ వాయిదా వేసిన న్యాయస్థానం

2లో

# బీఆర్ఎస్ 2.0 వెర్షన్

## కేసీఆర్ నిశ్శబ్ద ఆపరేషన్



- బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా కొత్త వ్యూహం
- నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు
- ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సమాయత్తం
- ఫామ్ హౌస్ కేంద్రంగా రాజకీయ చదరంగం

2లో

తెలంగాణ రాజకీయాల్లో పదిహేనేళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత్ రాష్ట్ర సమితి ఇప్పుడు తిరిగి పూర్వ వైభవం కోసం నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న అధినేత కేసీఆర్, ఇప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టడంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

- తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో





## ఇల్లంతా నోట్ల కట్టలే

- ప్రభుత్వ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- ఒడిశాలో బయటపడ్డ మరో అధికారి బాగోతం
- గనుల శాఖ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- రూ.30 వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత
- దేబబ్రత మహంతిని అరెస్టు చేసిన పోలీసులు
- భువనేశ్వర్‌లో రెండంతస్తుల భవనంలో బారీగా బంగారం గుర్తింపు

2లో

## యూట్యూబర్ అన్వేష్‌కు మరో షాక్

- లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు
- గతేడాది హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు
- సినీ నటి కరాటే కల్యాణి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- తాజాగా అన్వేష్ పై లుకౌట్ నోటీసులు జారీ



2లో



## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య

- హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య
- మృతదేహాన్ని భైంసా ఆస్పత్రికి తరలింపు
- మృతిపై విచారణ చేపట్టాలని డిమాండ్
- వీసీ ఛాంబర్‌ను ముట్టడించిన విద్యార్థులు
- ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కారణంగా పోలీసుల అనుమానం

2లో

## ఇంటర్ పరీక్షల తొలిరోజు 96.90శాతం హాజరు

- 15,903 మంది హాజరు కాలేదు
- రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు
- ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదు
- ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య
- సంస్కృతానికి బదులు హిందీ ప్రశ్నపత్రం
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఘటన

2లో



## పసిగుడ్డు ఏం అడిగిందని పొట్టనపెట్టుకున్నారు?

- కుమ్మెర ఘటనపై అసెంబ్లీలో పోరాటం చేస్తాం
- కుమ్మెర గ్రామస్థుల ఆందోళనకు మద్దతు
- సమాజమే తలదించుకోవాల్సిన ఘటన
- కుమ్మెర జాతరలో ఘటన
- సమాజంలో ఈనాటికి కులం పేరుతో దాడులు జరగటం దారుణం
- హంతకులకు ఎవరూ అండగా నిలబడొద్దు
- 8 మందిని వెంటనే అరెస్టు చేయాలి
- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

సమాజం తలదించుకోవాల్సిన ఘటన కుమ్మెర జాతరలో జరిగిందని, పసిగుడ్డు ఏం అడిగిందని పొట్టనపెట్టుకున్నార ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో హత్యారాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద బాధిత చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుమ్మెర గ్రామస్థుల చేస్తున్న ధర్నాకు కేటీఆర్

।మిగతా 2 లో।

## పాత నేతలు శాశ్వతంగా ఉండలేరు

- కొత్త తరాన్ని ఆహ్వానించాల్సిందే
- పార్టీ భవిష్యత్తు కోసం తాజా ఆలోచనలు అవసరం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మంత్రి పదవులు డిమాండ్
- ఆ డిమాండ్‌కు మద్దతు తెలిపిన డిప్యూటీ సీఎం

2లో



**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

కర్ణాటక మంత్రివర్గంలోకి కొత్త రక్తానికి అవకాశం కల్పించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. పాత తరం నాయకులు ఎప్పటికీ కొనసాగలేరని, పార్టీ భవిష్యత్తు కోసం తాజా ఆలోచనలు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో పాల్గొన్న శివకుమార్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు కేబినేట్లో స్థానం కల్పించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలిపారు. తన కేబినేట్ సహచరుడు హెచ్సీ మహా

।మిగతా 2 లో।

# యూట్యూబర్ అన్వేష్‌కు మరో షాక్

**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్:**



గతేడాది డిసెంబర్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ)పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. హిందూ దేవతలపై అన్వేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలతో గత కొంత కాలంగా సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అతడి కామెంట్స్ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయంటూ సినీ నటి కరాటే కల్యాణి ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అతడిపై చర్యలు చేపట్టారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చర్చగా చాలా మంది అతడి ఇన్స్టా, యూట్యూబ్ ఛానళ్లను అన్‌ఫాలో, అన్‌సబ్‌స్క్రైబ్ చేశారు. గతేడాది డిసెంబర్లో ఓ ఈవెంట్లో ప్రముఖ సినీ నటుడు శివాజీ హీరోయిన్ల డ్రెస్సింగ్ గురించి చేసిన కామెంట్స్‌ను అన్వేష్ తప్పుబట్టాడు. ఇది కాస్త వివాదాస్పదం అయినప్పటికీ, దీనికి వివరణ ఇవ్వడం క్రమంలో హిందువుల ప్రధాన ఆరాధించే సీతాదేవి, ద్రౌపదీదేవి గురించి అన్వేష్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడు. ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావుపైనా అభ్యంతరకరంగా మాట్లాడాడు. దీనికి సంబంధించిన వీడియోను అతడి ఇన్స్టా, యూట్యూబ్ ఛానళ్లలో పోస్ట్ చేశాడు. దీంతో ఎంతో మంది నెటిజన్లు దీనిపై మండిపడ్డారు. హిందూ సంఘాలు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేవతలపైన అన్వేష్ చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయంటూ, సినీ నటి కరాటే కల్యాణి అతడిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రపంచ యాత్రికుడిపైనా, అతడికి సంబంధించిన ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్ అకౌంట్లపైనా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, అంతకుముందు అతడిపై ఖమ్మం, తదితర ప్రాంతాల్లోనూ పలు ఫిర్యాదులు అందాయి. అన్వేష్ ఈ వివాదం జరగకముందు నుంచే విదేశాల్లోనే ఉంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్ట్ చేస్తున్నాడు. అయితే ఇటీవల మలేషియా, థాయ్‌లాండ్ దేశాల్లో అతడు ప్రపంచ యాత్రను చేస్తున్నట్లు సమాచారం. కానీ, అతడు ప్రస్తుతం ఎక్కడున్నాడు మళ్లీ ఇండియాకు ఎప్పుడొస్తాడన్న దానిపై ఈ స్పష్టత లేదు. అయితే, అన్వేష్ పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో భాగంగా అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇండియాకు వచ్చిన వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరిపే అవకాశం ఉంది

# పసిగుడ్డు ఏం అడిగిందని పొట్టనపెట్టుకున్నారు?

మొదటీ పేజీ తరువాయి

మద్దతు ప్రకటించారు.

పసిపాప ప్రాణాలు తీసిన హంతకులకు ఎవరూ అండగా నిలబడొద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. చిన్నారి, తల్లిదండ్రులపై దాడిచేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు బాధిత కుటుంబానికి అండగా నిలవకపోవటం హేయమైన చర్య అని, హంతకులను కాపాడే ప్రయత్నం చేయటం సిగ్గుమాలిన ప్రక్రియ అని మండిపడ్డారు.సమాజంలో ఈ నాటికి కులం పేరుతో దాడులు జరగటం దారుణమన్న ఆయన రెండు నెలల చిన్నారికి కులం తెలుసా? మతం తెలుసా? అని ప్రశ్నించారు. హంతకుడు ఏ పార్టీవాడైనా కచ్చితంగా కఠినంగా శిక్షించాలని అన్నారు. చిన్నారి మరణానికి కారణమైన 8 మందిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కుమ్మెర ఘటనలో నిందితులపై హత్యా నేరం కింద కేసు పెట్టాలన్న కేటీఆర్ బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.లక్ష, ఇల్లు కట్టిస్తామని తెలిపారు. ఈ ఘటనలో 8 మంది నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసిన ఆయన అసెంబ్లీ సమావేశాల్లో కుమ్మెర ఘటనపై బీఆర్ఎస్ పార్టీ తరఫున గళమెత్తుతామని అన్నారు.రెండేళ్లుగా కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని విలవిలలాడుతున్న తెలంగాణలో మనుషులనే కాదు చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన పల్లె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆరోపించారు. దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను



కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన పల్లెలను అన్ని రకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం రోజుకో విధంగా బయట పడుతోందన్నారు. ఇప్పటికే నదులపై ఉన్న చెక్డ్యామ్లను పేల్చివేస్తున్నారని, చెరువులను చెరబట్టారని కేటీఆర్ మండిపడ్డారు, వ్యవసాయాన్ని కుప్పకూల్చారని, కులవృత్తులను కాలరాసి ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా నరికేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పల్లె కన్నీరు పెడుతుందో అని మరోసారి పాడుకునే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలోని ప్రతి పల్లె తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు.

# ఇంటర్ పరీక్షల తొలిరోజు 96.90శాతం హాజరు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం ద్వితీయ భాష పరీక్షకు 5,14,598 మంది హాజరు కావాల్సి ఉండగా.. 4,98,695 (96.90శాతం) మంది హాజరయ్యారు. 15,903 మంది హాజరు కాలేదు. తొలిరోజు పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. బుధవారం ఆయన సికింద్రాబాద్, మారేడుపల్లి ప్రాంతాల్లోని పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు బోర్డు జారీచేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 75 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 200 సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు, 1,495 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1,495 మంది వివిధ శాఖల అధికారులు పాల్గొంటున్నారని కృష్ణ ఆదిత్య వెల్లడించారు.

**సంస్కృతానికి బదులు హిందీ ప్రశ్నపత్రం**

సంస్కృతం పరీక్ష రాయాల్సిన విద్యార్థికి హిందీ ప్రశ్నపత్రం ఇచ్చిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో చోటుచేసుకున్నది. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణిదీప్ అనే విద్యార్థికి స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం కేటాయించారు. మొదటి రోజు తెలుగు, హిందీ, అరబిక్, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించగా.. సంస్కృతం పరీక్ష రాయాల్సిన మణిదీప్‌కు ఇన్విజిలేటర్ హిందీ ప్రశ్నపత్రం ఇచ్చారు. సంస్కృత ప్రశ్నపత్రాన్ని హిందీ భాషలోనే ఇస్తారేమోనని భ్రమపడి.. ఆ విద్యార్థి హిందీ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు సంస్కృతంలో జవాబులు రాశాడు. పరీక్ష పూర్తయిన అనంతరం ఇంటికి వెళ్లి తన తండ్రి యాదయ్యకు ఈ విషయం చెప్పాడు. యాదయ్య వెంటనే మణిదీప్‌ను వెంటబెట్టుకొని పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లి చీఫ్ సూపర్‌వైజర్ అరుణ, ఏసీఎస్ ఆంజనేయులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ కరణ్‌జీరావులను నిలదీశారు. దీంతో పొరపాటు జరిగినట్లు పరీక్ష కేంద్రం అధికారులు గుర్తించి.. డీఐఈవో, డీఈసీల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ కోసం సీఎస్, ఏసీఎస్, డీవో, విద్యార్థి, విద్యార్థి తండ్రిని మహబూబ్‌నగర్‌కు రావాలని సూచించడంతో వారంతా అక్కడికి వెళ్లారు. కాగా, ఇన్విజిలేటర్ పొరపాటు వల్ల తన కుమారుడికి ఒక సంవత్సర కాలం వృథా కానుందని యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పరీక్షల నిర్వహణ అధికారి కరణ్‌జీరావుకు జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ కౌసర్ జహాన్ షోకాజు నోటీసు జారీచేశారు.

**కన్నతల్లులు మృతి.. కన్నీళ్లతోనే పరీక్షకు..**

ఇంటర్ పరీక్షల మొదటి రోజు ఇద్దరు విద్యార్థులు పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాయాల్సి వచ్చింది. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీ(నూకపల్లి)కి చెందిన కనగల లక్ష్మణ్‌బాబు అనూషల పెద్ద కుమార్తె రమ్యశ్రీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అనూష మంగళవారం కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది . ఆ బాధను దిగమింగుకున్న రమ్యశ్రీ పరీక్షకు హాజరైంది. తర్వాత తల్లి అంత్యక్రియల్లో పాల్గొంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో నివాసముండే గోపులారం రమేశ్, కల్పన దంపతులకు రవితేజ, హిమశ్రీ సంతానం. కల్పన శంకర్‌పల్లిలోని కేజీబీవీ పాఠశాలలో కంప్యూటర్ టీచర్‌గా పనిచేస్తూ.. అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. కుటుంబసభ్యులు మృతదేహాన్ని స్వగ్రామమైన సంగారెడ్డి జిల్లా కొల్లూరుకు తరలించారు. ఇంటర్ చదువుతున్న రవితేజ.. తల్లి మరణించిన దుఃఖంతోనే పరీక్షకు హాజరయ్యాడు.



# పి.సి.ఘోష్ కమిషన్ చెల్లదు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్టులోని పిల్లర్ నెంబర్ 20 బీటలు వారడంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కొట్టేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వేర్వేరుగా వేసిన పిటిషన్లపై బుధవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. వారితోపాటు ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్.కె.జోషి వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారించింది. కేసీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదిస్తూ... కమిషన్ ప్రక్రియ చట్టబద్ధంగా లేదన్నారు. కేసీఆర్ కీర్తిప్రతిష్ఠలను దెబ్బతీసేలా కుట్ర జరిగిందన్నారు. కమిషన్ రిపోర్టు అసెంబ్లీలో పెట్టకముందే మీడియాలో వచ్చిందని, ప్రభుత్వంలో ఉన్న వారే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పెట్టారని, పబ్లిక్ డొమైన్‌లో కూడా పెట్టేశారని చెప్పారు.

హరీష్ తరఫు న్యాయవాది వాదిస్తూ... ప్రాజెక్టు నిర్మాణం క్యాబినెట్ ఆమోదం మేరకే జరిగిందన్నారు. మేడిగడ్డ వద్ద 2023 వరదలు వచ్చి ఒక పిల్లర్ బీటలు వారిందన్నారు. కేంద్ర డ్యాం సేఫ్టీ అథారిటీ రిపోర్టు ఇచ్చిందని చెప్పారు. దీనిపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ తీరు చట్టబద్ధంగా లేదన్నారు. పిటిషనర్లపై ఆరోపణలు చేసిన వాళ్లను విచారణ చేసేందుకు, ఆ ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు వీలుగా సెక్షన్ 8బి, 8సి ప్రకారం నోటీసులు ఇవ్వలేదన్నారు. కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించడం చెల్లదని చెప్పారు. విచారణను ఈ నెల 27కి వాయిదా వేసిన న్యాయస్థానం.. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోరాదన్న గత మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్టు ప్రకటించింది.

**హైడ్రాకు రూ.లక్ష జరిమానా ప్రయివేటు స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ఫలితం**

ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ ప్రయివేటు వ్యక్తులకు చెందిన స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన హైడ్రాకు హైకోర్టు రూ.లక్ష జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని పిటిషనర్లకు చెల్లించాలంది. వెంటనే పెన్సింగ్‌ను తొలగించాలని ఆదేశించింది. గడువు తీసుకుంటే రోజుకు లక్ష రూపాయలు చొప్పున పిటిషనర్‌కు చెల్లించాలంది. ఆధారాలు లేకుండా ప్రభుత్వ స్థలమని చెప్పి ఫెన్సింగ్ ఏర్పాటు చెల్లదని మరోసారి తేల్చి చెప్పింది. రంగారెడ్డి జిల్లా ఉప్పల్ మండలం మల్లాపూర్‌లోని ఒక సర్వే నెంబర్‌లో ఉన్న బాబానగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ లేఔట్‌లోని రెండు ప్లాట్‌లకు ఫెన్సింగ్ వేయడాన్ని సవాల్ చేసిన కేసులో జస్టిస్ శ్రవణ్ కుమార్ అడ్వొకేట్ కమిషన్ ద్వారా క్షేత్రస్థాయి నివేదిక తెప్పించుకుని పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు.



# ఇళ్లంతా నోట్ల కట్టలే

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో:**

ఒడిశాలో ఓ చిన్న లంచం కేసు దర్యాప్తు భారీ అవినీతి కుంభకోణాన్ని బయటపెట్టింది. రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ప్రభుత్వ అధికారి ఇంట్లో కోట్ల రూపాయల నగదు లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది. విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు పరిమాణం చూసి వారు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు.

ఒడిశాలోని కటక్ సర్కిల్ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దేబబ్రత మహంతి అవినీతి ఆరోపణలపై అరెస్టయ్యాడు. లైసెన్స్ పొందిన ఓ బొగ్గు వ్యాపారి నుంచి డిపో నిర్వహణ, రవాణా అనుమతుల కోసం రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందడంతో ఒడిశా విజిలెన్స్ డైరెక్టరేట్ అధికారులు ఉచ్చు వేశారు. మంగళవారం రాత్రి లంచం తీసుకుంటున్న సమయంలోనే ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అరెస్టు అనంతరం కేసు నమోదు చేసి, బుధవారం ఉదయం నుంచి మూడు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. భువనేశ్వర్‌లోని ఆయన నివాస ఫ్లాట్, భద్రక్ జిల్లాలోని స్వగ్రామ ఇల్లు, అలాగే కటక్‌లోని కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో బయటపడిన నగదు చూసి అధికారులు షాక్‌కు గురయ్యారు. భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ట్రాలీ బ్యాగులు, అల్మారాలు, డ్రాయర్లలో దాచిపెట్టిన నగదును లెక్కించగా రూ.4 కోట్లకు పైగా ఉన్నట్లు గుర్తించారు. లెక్కల్లో చూపించని ఈ మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. అదనంగా ఆయన కార్యాలయంలోని టేబుల్ డ్రాయర్‌లో మరో రూ.1.20 లక్షల నగదు కూడా పట్టుబడింది.

ఇదే కాకుండా మహంతికి చెందిన మరిన్ని ఆస్తులు కూడా వెలుగులోకి వచ్చాయి. భువనేశ్వర్ సమీపంలోని పహాలా ప్రాంతంలో సుమారు 2,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండంతస్తుల భవనం, దాదాపు 130 గ్రాముల బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించారు. ఇవన్నీ ఆయన అధికారిక ఆదాయానికి మించి ఉన్నాయని అనుమానిస్తున్నారు. స్థిర, చరాస్తుల పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు చెబుతున్న ప్రకారం, ఒడిశా చరిత్రలో ఒకే అధికారి ఇంటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం కావడం ఇదే తొలిసారి. గతంలో కూడా పలువురు అధికారులపై సోదాలు జరిగి కోట్లు బయటపడినప్పటికీ, ఈ స్థాయి నగదు ఎప్పుడూ దొరకలేదని పేర్కొన్నారు.


మహంతి ఉద్యోగ ప్రస్థానం కూడా పరిశీలనలోకి వచ్చింది. 2004లో జూనియర్ మైనింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సేవలో చేరిన ఆయన బాలంగీర్, బారిపడ, బెర్హంపూర్, కటక్, భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. తరువాత ప్రమోషన్లు పొందుతూ ఇటీవలే కటక్ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే కొద్ది కాలంలోనే అవినీతి ఆరోపణలతో చిక్కుకోవడం సంచలనంగా మారింది. భువనేశ్వర్ విజిలెన్స్ విభాగం ఎస్పీ సరోజ్ కుమార్ సామల్ మీడియాతో మాట్లాడుతూ, మహంతిని స్పెషల్ విజిలెన్స్ కోర్టులో హాజరుపరుస్తామని, అతని ఆస్తులపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. రూ.30 వేల లంచం కేసుతో మొదలైన ఈ దర్యాప్తు కోట్ల రూపాయల అక్రమ సంపాదనను బయటపెట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఎంతగా వేర్లు వేసిందనే ప్రశ్న మళ్లీ ముందుకు వచ్చింది. విజిలెన్స్ శాఖ చర్యలతో ఇతర అవినీతి అధికారులకు ఇది గట్టి హెచ్చరికగా మారింది.

# బిఆర్ఎస్ 2.0 వెర్షన్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో పదిహేనేళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత్ రాష్ట్ర సమితి ఇప్పుడు తిరిగి పూర్వ వైభవం కోసం నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న అధినేత కేసీఆర్, ఇప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టడంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగిస్తూనే, ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. రాజకీయాలు వేగంగా మారుతున్నా కేసీఆర్ ఏమాత్రం తొందరపడకుండా వ్యవహరిస్తున్నారు. వెళ్లే వారిని అడ్డుకోకుండా, మిగిలి ఉన్న నిబద్ధత గల నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పదవుల కోసం పార్టీ మారే వారితో పోలిస్తే, సిద్ధాంతం కోసం నిలబడే వారే పార్టీకి అసలైన బలమని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తున్నారు. దీనికోసం ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. గతంలో తెలంగాణ సెంటిమెంట్ మీద ఎక్కువగా ఆధారపడిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల మీద గొంతు ఎత్తుతోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడటం ద్వారా కోల్పోయిన ప్రజాధారణను మళ్ళీ పొందవచ్చని కేసీఆర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. శాసనసభలో కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా వ్యూహకర్తలతో కలిసి నిరంతర చర్చలు జరుపుతున్నారు. ఓ వైపు తెలంగాణ సెంటిమెంట్ తో పాటు ప్రజా సమస్యలను కూడా ఎక్కువగా తెరపైకి తెచ్చి పోరాడాలని భావిస్తున్నారు. బయటకు పెద్దగా కనిపించకపోయినా, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ చదరంగం నడుపుతున్నారు. ఎప్పుడు ఏ అడుగు వేయాలో తెలిసిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైనప్పుడు దాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకప్పుడు ఉద్యమ నేతగా పార్టీని ఎలా నిర్మించారో, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పునర్నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.సరైన సమయం చూసి బీఆర్ఎస్ పార్టీ మొత్తాన్ని ఒక్క సారి రీయాక్టివేట్ చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. గోదావరి జలాల పేరుతో బహిరంగసభలతో దీన్ని ప్రారంభించాలనుకున్నా.. మున్సిపల్ ఎన్నికల కారణంగా వాయిదా వేశారు.



## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి

# ఆత్మహత్య

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో బుధవారం విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దాంతో ట్రిపుల్ ఐటీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం ఉదయం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని ట్రిపుల్ ఐటీ కళాశాల అధికారులు మధ్యాహ్నం వరకు బయటకు పొక్కకుండా చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలించారు. వనపర్తి జిల్లాకు చెందిన వసంత(21) వ్యక్తిగత సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు తెలిపారు. విద్యార్థిని రెండు రోజులుగా ముభావంగా ఉంటున్నట్టు తోటి విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థిని ప్రేమించిన యువకుడు ఆత్మహత్య చేసుకోవటంతో ఈమె కూడా ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమా? మరేదైనా కారణమా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది. విద్యార్థిని గొంతుపై గాయాలుండటంతో ఆత్మహత్యపై అనుమానాలున్నాయని విద్యార్థులు సాయంత్రం యూనివర్సిటీ వీసీ ఛాంబర్‌ను ముట్టడించారు. మృతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# పాత నేతలు శాశ్వతంగా ఉండలేరు

మొదటీ పేజీ తరువాయి

దేవప్ప చేసిన దళిత ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని శివకుమార్ తెలిపారు. మహాదేవప్ప చేసిన వ్యాఖ్యలను విని నట్లు చెప్పారు. ఆయన హైకమాండ్‌కు దగ్గరగా ఉంటారని, మార్పునకు సంబంధించి మంత్రి మహదేవప్ప వద్ద సమాచారం ఉండి ఉంటుందని తెలిపారు. అందుకే దళిత నాయకుడు ముఖ్యమంత్రి కావాలని వ్యాఖ్యలు చేసి ఉంటారని అన్నారు. కానీ తన దగ్గర మాత్రం ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మంత్రుల వ్యాఖ్యలపై నిశ్శబ్దంగా ఉన్నారన్న విమర్శలపై శివకుమార్ స్పందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలను నియంత్రించాల్సింది ముఖ్యమంత్రే అని తెలిపారు. పార్టీకి సంబంధించిన విషయాలను తాను ఎప్పటికప్పుడు అధిష్ఠానంతో చర్చిస్తూ వస్తున్నానని తెలిపారు. తనను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఢిల్లీకి పిలిచారనే వార్తలపై స్పందిస్తూ, తనకు ఎలాంటి కాల్స్ రాలేదని స్పష్టం చేశారు. తన శాఖకు సంబంధించిన పనుల కోసం ఢిల్లీకి వెళ్లాల్సి ఉందని శివకుమార్ తెలిపారు. మంత్రి సతీశ్ జార్కిహోళి సీనియరు నాయకుడని, తనతో కలిసి కార్యాధ్యక్షునిగా సేవలు అందించారని పేర్కొన్నారు. వారానికి ఒకసారైనా తామిద్దరం మాట్లాడుకుంటామన్నారు. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడమే మా నాయకులందరి ఏకైక అజెండా అని చెప్పారు.నేను ఢిల్లీకి వెళ్తాను. దాని గురించి కొత్తగా ఏదైనా ఉందా? నేను ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. నేను అనేక విద్యా సంస్థలను నిర్వహిస్తున్నా. ఆ విషయాలకు సంబంధించి నేను ఢిల్లీకి వెళ్తున్నా. హైకమాండ్ నాయకులను కూడా కలుస్తాను. అలాగే రాహుల్ గాంధీ, సోనియా గాంధీను కూడా కలుస్తా. ఇక మల్లికార్జున ఖర్గే ఇక్కడ బెంగళూరులో ఉంటారు. నేను ఆయనను ఇక్కడ కలుస్తాను' అని డీకే తెలిపారు.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో, తమకూ అవకాశం కల్పించాలని కోరుతూ తొలిసారి ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం సిద్ధరామయ్య, శివకుమార్ సహా పార్టీ అధిష్ఠానానికి లేఖ రాశారు. ఈసారి 38 మందిని కొత్తగా అసెంబ్లీకి పంపడం ద్వారా ప్రజలు యువ నాయకత్వం కోరుకుంటున్నారని, ఆ మేరకు కనీసం నూతనంగా ఎన్నికైన ఐదుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. కొత్త ఎమ్మెల్యేల డిమాండ్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన శివకుమార్ కేబినెట్‌లోకి కొత్త తరాన్ని ఆహ్వానించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.





# రంగ్ హోలీ ఫెస్టివల్ నీ విజయవంతం చేయండి

- బ్రదర్స్ టీం సభ్యులు

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:**

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో మెగా రంగ్ హోలీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు .ఈ వేడుకలను రంగుల హరివిల్లుగా,సాంస్కృతిక ఉత్సాహంతో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా కార్యక్రమంలో పాల్గొనే వారికి బ్రదర్స్ టీమ్ తరఫున ఉచితంగా రంగులు,సంగీతం,స్ప్రింక్లింగ్ వాటర్ సిస్టమ్ ఏర్పాటు చేయబడింది.విద్యార్థులు,యువత ఉత్సాహంగా,సురక్షితంగా హోలీ పండుగను ఆనందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్,మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ హాజరై హోలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యువత ఐక్యతతో,ఆనందంగా పండుగ జరుపుకోవాలని సూచించారు.వేడుకల సందర్భంగా మద్యం,గుడ్లు,ధూమపానం వంటి ఇతరులకు హాని కలిగించే పదార్థాలు పూర్తిగా నిషేధించబడినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. అందరూ నియమాలను పాటిస్తూ సంతోషంగా రంగుల పండుగను జరుపుకోవాలని కోరారు.ఈ మెగా రంగ్ హోలీ ఉత్సవాన్ని బ్రదర్స్ టీం ఆర్గనైజర్స్ పాతకల ప్రవీణ్, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి,గట్టు సాయిరామ్,సామల వెంకట్ రెడ్డి,కొత్త గణపతి రెడ్డి,పనికరి మహేష్,మహేష్ ప్రణయ్, శివనాగరాజు ,సందీప్, అఖిరానందన్ తదితరులు పాల్గొన్నారు.



# లీడ్ బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

ఈనెల 28న లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట సీతా రామాంజనేయులు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కెడిసిసిబిలో సన్మాన కార్యక్రమం జరిగింది.జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రభుత్వ పథకాల అమలు లక్ష్యంలో లీడ్ బ్యాంకు మేనేజర్ అందించిన సేవలను కొనియాడారు.ప్రభుత్వ శాఖల అధికారులు,బ్యాంకర్లను సమన్వయ పరచడంలో ఆయన కృషిని అభినందించారు.జిల్లాలో రుణాల పంపిణీ వార్షిక ప్రణాళిక రూపొందించడం, రుణ పంపిణీ పర్యవేక్షణలో ఉత్తమ సేవలు అందించారని అన్నారు. బ్యాంకింగ్ సేవలలో ఖాతాదారులకు ఎదురైన సమస్యలను పరిష్కరించడంలో,వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేశారని గుర్తు చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో వివిధ బ్యాంకింగ్ రంగాలకు చెందిన అధికారులు,సిబ్బంది,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వరంగల్ ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీ

- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- జిల్లా కలెక్టర్ సత్య శారద

**వరంగల్, తెలంగాణ చౌరస్తా:**

ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం,ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా,వైద్య సేవల పరిస్థితిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు.వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ,మెగా టెక్స్టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంటూ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు.అనంతరం ఆసుపత్రి వైద్యులు,నర్సులు, సిబ్బందితో ఎంపీ,కలెక్టర్ లు సమావేశమై ఆసుపత్రి నిర్వహణ,సౌకర్యాల లోటుపాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.వైద్యుల ఖాళీల భర్తీ, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఈ డాక్టర్. బి.సాంబశివరావు,ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్య లక్ష్మి,డాక్టర్ అశోక్,డాక్టర్ రామచంద్ర,ఆర్ ఎం ఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# బిహెచ్ఎల్‌లో తోట వెంకటస్వామి పదవీ విరమణ

- ఘనంగా సన్మాన కార్యక్రమం

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

బిహెచ్ఎల్ హెచ్ఆర్‌డీసీ లో అదనపు ఇంజనీర్‌గా దీర్ఘకాలం పాటు సేవలందించిన తోట వెంకటస్వామి పదవీవిరమణ సందర్భంగా హెచ్ఆర్‌డీసీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, సహచరులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై వెంకటస్వామి-పద్మావతి దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితాన్ని అంకితభావంతో పూర్తి చేసి కొత్త జీవన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న వెంకటస్వామి సేవలను స్మరించుకున్నారు. భెల్ సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం దంపతులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చెన్నం మధు-శ్రీవాణి, తోట కార్తీక్-అలేఖ్య కుటుంబ సభ్యులతో కలిసి అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మనవళ్లు మనవరాళ్లు పాల్గొని ఆనందాన్ని మరింత రెట్టింపు చేశారు.



# మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు జరిపిన గులాబీ శ్రేణులు
- దాసరి మనోహర్ రెడ్డికి బర్త్ డే విషెస్ తెలిపిన ఎలిగేడు బీఆర్ఎస్ నాయకులు

**ఎలిగేడు,తెలంగాణ చౌరస్తా :**

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎలిగేడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు బాణాసంచా కాల్చి, సంబరాలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ... పెద్దపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దేనని గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో పెద్దపల్లిని అన్ని రంగాల్లో సుందరీకరణంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి రైతులు, ప్రజలు గోసపడుతున్నారని, మళ్లీ ఎమ్మెల్యేగా మనోహర్ రెడ్డి, సీఎంగా కేసీఆరే రావాలని కోరుకుంటున్నారన్నారు. పెద్దపల్లి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, యువకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ పూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మాజీ సర్పంచులు కొండయ్య, రాజు, స్వప్న, కుమార్, లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంసీ కమిషనర్ సృజన ను కలిసిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

- భారతి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి వినతి

**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా:**

భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన కు మర్యాదపూర్వకంగా కలసి, పలు ప్రజా సమస్యలపై వినతి పత్రం అందజేశారు. బొంబాయి కాలనీ రైతు బజార్ టెండర్ కమ్ ఓపెన్ ఆక్షన్‌లో పాల్గొన్న సింగిల్ బిడ్ షాపుల కేటాయింపుపై చర్చించారు. టెండర్ ప్రక్రియలో సింగిల్ బిడ్ షాపులు కేటాయించబడవని ముందుగా స్పష్టంగా తెలియజేయలేదని, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుని నిరాశకు గురయ్యారని వివరించారు. సింగిల్ బిడ్ షాపులను వచ్చిన వారికి కేటాయించాలని కోరారు. అదే విధంగా టెండర్‌లో పొందుపరచని 22 షాపులకు తక్కువ ధర నిర్ణయిస్తే, ఆ షాపులను మహిళా స్వయం సహాయక సంఘాలు, ఆర్థికంగా బలహీన మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన మిగతా 33 షాపులకు కూడా త్వరితగతిన టెండర్ నిర్వహించాలని కోరారు. బొంబాయి కాలనీ కమ్యూనిటీ హాల్‌కు బొంబాయి కాలనీ మరియు ఫెన్సింగ్ ఏరియా కాలనీలు సమీపంలో ఉండటంతో స్థానిక ప్రజలకు అనుకూలంగా ఉండేలా ధర నిర్ణయించాల్సిందిగా సూచించారు.ఇటీవల కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆమోదించిన ఎంఎంటీఎస్ నుండి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బీటీ రోడ్డు పనులను వేగవంతం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా అమీన్‌పూర్ సర్కిల్ కార్యాలయాన్ని రామచంద్రాపురం సర్కిల్ పరిధిలోని ఎంఫీడీవో కార్యాలయానికి మార్పిడి (రిలొకేషన్) చేయాలని కోరారు. రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్యతో కలిసి కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.కమిషనర్ శ్రీజన తమ విన్నపాన్ని సానుకూలంగా స్పందించారని, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.



# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల సందర్శన

- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్
- ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 'స్టాటిక్ ఫోర్స్'తో పటిష్ట భద్రత
- విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వాతావరణం

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను,సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ....పరీక్షలు పారదర్శకంగా,ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించామని,పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా,ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని,వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



# వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- హెల్మెట్ వస్తువు కాదు.. ప్రాణాన్ని కాపాడే రక్షణ ఆయుధం
- పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి
- అరైవ్ - అలైవ్ లో భాగంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగాల గురించి అవగాహన


**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి సూచించారు. అరైవ్ అలైవ్ లో రెండో విడతలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... వాహనాదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించని వారిపై తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ధరించకుండా చాలామంది ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే వాహనదారులు తప్పకుండా వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. త్రిబుల్ రైడింగ్, హెవీ స్పీడ్ తో వాహనాలు నడపొద్దని కోరారు. హెల్మెట్ బరువుగా కాకుండా, బాధ్యతగా భావించాలన్నారు. హెల్మెట్ ఒక వస్తువు కాదు.. ప్రాణాన్ని కాపాడే ఆయుధమని అన్నారు. అనంతరం పట్టణంలో హెల్మెట్, సీటు బెల్టు ధరించిన వాహనాదారులకు డీసీపీ రాంరెడ్డి, ఏసీపీ జి. కృష్ణతో కలిసి గులాబీ పువ్వులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**సుల్తానాబాద్ లో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీసీపీ..**

సుల్తానాబాద్ లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, ఏసీపీ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోని భద్రత ఏర్పాట్లను, పోలీస్ బందోబస్తును డీసీపీ పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రంలోని పరిసరాల్లో 100 మీ.,200 మీ. పరిధిలో చట్టపరమైన నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.





# ఏఐ వినియోగంపై ప్రణాళికలు ఇవ్వండి

- ఎడోబ్ సీఈవోతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఆర్థికవ్యవస్థపై ఏఐ ప్రభావం
- భవిష్యత్‌లో దాని సక్రమ వినియోగంపై ప్రణాళికలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

శంతన్‌నారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు అంశాలపై చర్చలు జరిగాయి. గ్లోబల్ ట్రెండ్స్, అవకాశాలపై ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌కు అంశాలపై మాట్లాడుకున్నారు. తెలంగాణను మాన్యుఫ్యాక్చరింగ్ పవర్‌గా తీర్చిదిద్దేందుకు, ముఖ్యమైన సంస్థల్ని ఆకర్షించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించి ఇవ్వాలని సీఎం కోరారు. దీనికి శంతన్ నారాయణ్ సానుకూలంగా స్పందించారు.

# ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

- హర్షం వ్యక్తం చేసిన టీయూడబ్ల్యూజే నాయకులు



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీయూడబ్ల్యూజే (ఐజేయు)నారాయణపేట జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కోయిలకొండ నారాయణ,ప్రధాన కార్యదర్శి శివశంకర్,జాతీయ కౌన్సిల్ సభ్యులు నక్క శ్రీనివాస్,రాష్ట్ర డిజిటల్ మీడియా కార్యవర్గ సభ్యులు గణప రఘు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జర్నలిజం రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన వ్యక్తి మీడియా అకాడమీ చైర్మన్‌గా కొనసాగడం రాష్ట్రంలోని జర్నలిస్టులకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.జర్నలిస్టుల సంక్షేమం,సమస్యల పరిష్కారం,వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ వంటి అంశాల్లో చైర్మన్‌కు పూర్తి స్థాయి అవగాహన ఉందని తెలిపారు.నిజమైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ఆయన కృషి చేస్తారని తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో వృత్తి నిబద్ధతతో పనిచేస్తున్న జర్నలిస్టులకు తగిన గుర్తింపు,సంక్షేమ పథకాలు ,శిక్షణ కార్యక్రమాలు మరింత విస్తరించేందుకు ఆయన కృషి కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మీడియారంగ అభివృద్ధికి దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు

# విద్యుత్, మంచినీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

- ప్రతి కాలనీలో పచ్చదనం పారిశుధ్యానికి పెద్దపీట
- అనధికార హోర్డింగులు తక్షణమే తొలగించండి
- ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అమీన్ పూర్, పటాన్ చెరు బల్దియా సర్కిల్ అధికారులతో సమీక్ష



**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా :** పటాన్ చెరు మరియు అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిళ్ల పరిధిలోని ప్రతి కాలనీలో విద్యుత్, మంచి నీరు, పారిశుద్ధ్యం అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని.. ఇందుకు అనుగుణంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం పటాన్ చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పటాన్ చెరు, అమీన్ పూర్ సర్కిల్ బల్దియా అధికారులు, హెచ్ఎండబ్ల్యూఎస్,విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సర్కిల్ల పరిధిలో గల తెల్లాపూర్, ముత్తంగి, పటాన్ చెరు, జెపి కాలనీ, అమీన్ పూర్, బీరంగూడ, రామచంద్రాపురం, భారతి నగర్, బొల్లారం డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. రాబోయే వేసవి కాలానికి అనుగుణంగా రెండు సర్కిళ్ల పరిధిలోని ప్రతి కాలనీకి మంచినీరు ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నూతన కాలనీలకు సైతం స్వచ్ఛ జలాలు అందించేలా కొత్త పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.లో ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన పక్షంలో నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని.. ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పచ్చదనం పారిశుద్ధ్య అంశంపై ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని.. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి కాలనీలో తప్పనిసరిగా రోడ్లు శుభ్రపరచడంతో పాటు.. విధిగా చెత్తను సేకరించేలా చూడాలని కోరారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన హోర్డింగులను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుండి ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ప్రదీప్ కుమార్, జ్యోతి రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ జిఎం శ్రీనివాస్, విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, తహసిల్దార్లు వెంకటేష్, సరస్వతి, శానిటేషన్ డిఈ కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మంగలి శ్రీనివాస్ కు అనంతనారి చేయూత

**చేవెళ్ల, తెలంగాణ చౌరస్తా:** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మంగలి శ్రీనివాస్ అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అనంతనారి చేయూత ఫౌండేషన్ మానవత్వాన్ని చాటింది. బాధితుడి పరిస్థితి తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు వెంటనే స్పందించి వైద్య చికిత్సల కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు.సంస్థ అధ్యక్షులు మంగలి వెంకటేష్,వాణి సక్కుబాయి ఆధ్వర్యంలో శ్రీనివాస్‌కు నేరుగా సహాయక నిధులు అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మంగలి వెంకటేష్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ,ఇలాంటి క్లిష్ట సమయంలో మనసున్న దాతలు ముందుకు వచ్చి సహాయం అందిస్తే బాధిత కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తుందని అన్నారు. సంస్థ చేపట్టిన ఈ సహాయక చర్యకు స్థానికులు అభినందనలు తెలియజేశారు.



# విద్యార్థులు సమాజ మార్పులో భాగస్వామ్యమవ్వాలి

- పి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు
- ఆవుల నాగరాజు కోట ఆనంద్

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:** ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పి.ఎస్.యు) ప్రథమ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పి.ఎస్.యు జెండా ఆవిష్కరించారు.పి.ఎస్.యు ఓయూ కమిటీ కన్వీనర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆవుల నాగరాజు కోట ఆనంద్ మాట్లాడుతూ హిందూత్వం,వికసిత భారత్ అనే పేరుతో మనువాద కార్పోరేట్ రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి మతోన్మాదులు చేస్తున్న దాడిలో దేశంలోని పీడిత వర్గాలు,దళిత బహుజనులు, ఆదివాసీలు ఇతర సాంఘిక సముదాయాలు తీవ్రమైన దాడికి, అణచివేతకు గురవుతున్నారు. మేధోవర్గంగా విద్యార్థి లోకం వారికి అండగా నిలబడుతూ సమాజ మార్పులో భాగస్వామ్యమవ్వాలని అన్నారు.విద్యార్థులు శాస్త్రీయ,సమాన విద్య సాధించడం కర్తవ్యంగా పోరాడాలని అన్నారు.తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలు,యూనివర్సిటీలలో,హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు,సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు పక్కా భవనాలు, కెజి నుండి పిజి వరకు ఉచితంగా విద్యను అందిస్తూ కామన్ స్కూల్ విద్యా విధానం అమలు చేయాలి. విద్యా రంగానికి 30% నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్ షిప్ లు విడుదల చేయాలి,తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలలో ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలి.యూనివర్శిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు నూతన జాతీయ విద్యా విధానం 2020 పేరుతో విద్యా కాషాయికరణ, ప్రైవేటీకరణ, సరళీకరణలను చేస్తోందని అన్నారు. విద్యా సంస్థలలో కుల వివక్షతకు వ్యతిరేకంగా రోహిత్ చట్టం చేయడంతో పాటు యూజి సి ఇటీవల జారి చేసిన కుల వివక్ష వ్యతిరేక "సమానత్వ మార్గదర్శకాలను" పునరుద్ధరించి వాటిని మరింత బలోపేతం చేయాలనే కర్తవ్యాలతో ముందుకు సాగాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.ఎస్.యు ఓయూ కన్వీనర్ ప్రశాంత్, నాయకులు పవన్,బొడ్డు నాగరాజు ,లక్ష్మికాంత్, సతీష్,జుబిన్ ఖాన్, నరేందర్,సందీప్, కిషన్ పాల్గొన్నారు.




# ఎలక్ట్రరోల్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి

- ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి
- వారం రోజుల్లో 80 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలి.
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రతీ ఇంటికి వెళ్ళి ఖచ్చితమైన ఓటరు గుర్తింపుతో ప్రోసిడింగ్ మ్యాపింగ్,ఎలక్ట్రరోల్ మ్యాపింగ్ చేపట్టాలని వారం రోజుల్లో ఈ ప్రక్రియను 80 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారని ఆమె తెలిపారు.ఎస్ఐఆర్ ప్రారంభమైతే నేరుగా డిల్లీ నుంచి బృందం వచ్చి తనిఖీ చేస్తుందని,అప్పుడు ఏమైనా పొరపాటు ఉందని తేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అందుకే బిఎల్వోలు సమయం తీసుకుని ఇల్లిల్లు తిరిగి మ్యాపింగ్ చేయాలన్నారు.జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లాలోని దామరగిద్ద, ధన్వాడ, మరికల్, మక్తల్, మాగనూరు,కృష్ణ,ఉట్కూర్, నర్వ,నారాయణపేట మండలాల తహసీల్దార్లు ,ఏఈఆర్ వోలతో ఎస్ ఐ ఆర్ పై జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఈ ఆర్వో లు,బిఎల్వో లు, సూపర్ వైజర్లు ఇప్పుడే క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఉండదని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చాక ఒత్తిడి పడకుండా ఇప్పుడే ఎవరి పరిధిలో వారు పని చేసుకుంటే ఎస్ ఐ ఆర్ చేసే సమయంలో పని చాలా సులువు అవుతుందన్నారు.అయితే తహసిల్దారులు విధిగా పర్యవేక్షణ చేయాలని, ప్రస్తుతం తహసిల్దార్ కార్యాలయాల్లోనే మ్యాపింగ్ పని కొనసాగుతోందని తర్వాత విస్తరించే అవకాశం ఉందన్నారు. బిఎల్ఓ లకు ఆదేశాలిచ్చి ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయించాలన్నారు. మ్యాపింగ్ సమయంలో పొరపాటు జరగకుండా ఓటరు నిజమేనని నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. వలస వెళ్లిన ఓటర్ల వివరాలు కూడా సేకరించాలని, లేదంటే తీసే ఆస్కారం ఉందని, ఆ తర్వాత మళ్ళీ వాళ్లు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందనే విషయాన్ని మరచి పోవద్దు అని ఆమె తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ లో సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలలో 80 శాతం పూర్తి అయిందని, వారం రోజుల్లో మన జిల్లా కూడా 80 శాతం చేరుకోవాలని కలెక్టర్ తేల్చి చెప్పారు.ఈ సమీక్షలో ఆర్డిఓ రామచంద్రనాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారినిలు జయసుధ,రాణి దేవి,ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు




# పనిమనిషి దొంగతనం బట్టబయలు

- 95.4 గ్రాముల బంగారం, రూ.8 వేల నగదు స్వాధీనం

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దొంగతనం కేసులో ఇంటి పనిమనిషిని అరెస్ట్ చేసి,అపహరించిన 95.4 గ్రాముల బంగారు ఆభరణాలు రూ.8 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసిన ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.3,88,000గా పోలీసులు తెలిపారు.ఈ మేరకు క్రైమ్ నంబర్ 89/2026 కింద కేసు నమోదు చేశారు. ఓయూ పిఎస్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఓయూ ఏసీపీ జగన్, ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్ ,ఎస్ ఐ కరుణాకర్ తో కలిసి మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ కాలనీ, హబ్సిగూడకు చెందిన రిటైర్డ్ శాస్త్రవేత్త డా. పి.ఎల్.కె.ఎం. రావు (79) ఇంట్లో పనిచేస్తున్న అలమ్ తేజస్వి (43) అనే మహిళ ఈ దొంగతనానికి పాల్పడింది.ఆమె స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా, ఆచంపేట మండలం కొండనగుల గ్రామం. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. 2025 జూన్‌లో ఇంటి పనిమనిషిగా చేరిన తేజస్వి, యజమానుల విశ్వాసాన్ని పొందిన తర్వాత 2025 అక్టోబర్ నుంచి 2026 ఫిబ్రవరి 23 మధ్య కాలంలో ఇంటి శుభ్రపరిచే పనుల సమయంలో బంగారు గొలుసులు,గాజులు,ఉంగరాలు, చందరహారం తదితర ఆభరణాలను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు.ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఫిబ్రవరి 25 ఉదయం హబ్సిగూడ బస్ స్టాప్ వద్ద నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం అదే రోజు ఉదయం 11:30 గంటలకు ఆమెను అధికారికంగా అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.ఈ కేసును సబ్ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.ఇన్స్పెక్టర్ యం. మహేష్ గౌడ్ పర్యవేక్షణలో, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగన్ మార్గదర్శకత్వంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సికింద్రాబాద్ జోన్ పర్యవేక్షణలో అరెస్ట్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.





# ఘనంగా మాజీ ఎమ్మెల్యే దాసరి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- జిల్లా ప్రభుత్వ దావఖానలో రోగులకు పండ్లు పంపిణీ
- పలుచోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు
- నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- దాసరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు



**పెద్దపల్లి / సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నివాసం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన వేదికపై ఆయన బర్త్ డే కేక్ ను కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు దాసరి మనోహర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్లపాటు పెద్దపల్లి నియోజకవర్గంలో మండలాల, గ్రామాల అభివృద్ధికి దాసరి మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎనలేని సేవలందించారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు యువకులు రక్తదానం చేసి, తమ అభిమానాన్ని చాటారు. మాజీ ఎమ్మెల్యే దాసరి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని పలు గ్రామాల్లో గులాబీ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని మండలాల్లో, గ్రామాల్లో ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసి, ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, బీఆర్ఎస్వి అధ్యక్షులు సతీష్ గౌడ్, మాజీ ఎంపీపీలు సంపత్ యాదవ్, తానిపర్తి స్రవంతి మోహన్ రావు, మండల అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, జూపల్లి సందీప్ రావు, బోయని రాజమల్లు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, పలు గ్రామాల సర్పంచులు నర్ల పోల్ రాజు , ఓజా సంపత్, బోయిని శ్రీనివాస్, భూమేష్,యాదగిరి, నాయకులు సలేంద్ర రాములు, తాళ్లపల్లి మనోజ్ గౌడ్, ముత్యాల రాజయ్య,తీగల సదయ్య,చెంచు సది, చందు, పురుషోత్తం, కొయ్యడ విక్రం, కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, రాజు, గాజుల అరుణ్ కుమార్, పర్శ సురేష్, నర్ల సాయికుమార్, వీరబోయిన సుధీర్, మధు, జక్కుల శ్రీకాంత్, లవన్, ఫకీర్ యాదవ్, అరుణ్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి

- కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్




**చేవెళ్ల,తెలంగాణ చౌరస్తా:** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో నీటి వనరులను సంరక్షించాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ పేర్కొన్నారు.బుధవారం రజక నగర్,అంబేద్కర్ నగర్ (పోచమ్మ గుడి) ప్రాంతాల్లో పాడైన బోర్ మోటర్లను మరమ్మతు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.చిన్నచిన్న అవసరాల కోసం తరచూ బోర్లు వేయడం వల్ల మోటార్లు కాలిపోవడంతో పాటు ప్రజాధనం వృథా అవుతుందని తెలిపారు. అందువల్ల అందరూ జాగ్రత్తగా నీటిని వినియోగించి, ప్రజాసంపత్తిని కాపాడాలని కోరారు.అదేవిధంగా వార్డులో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను అభ్యర్థించారు.వార్డులో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.







# విజయమే మీ లక్ష్యం కావాలి

- పాఠశాలకు,తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలి
- అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 62 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేత
- అశోక చక్రవర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా :**

ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న 62 మంది విద్యార్థులకు అశోక చక్రవర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల శైలజ అశోక్ యాదవ్ వివాహ దినోత్సవ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న 62 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా అశోక చక్రవర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకొని ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత తెచ్చుకొని, పాఠశాలకు , తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు విద్యార్థులకు సూచించారు. గత 3సంవత్సరాలుగా అశోక చక్రవర్తి ఫౌండేషన్ ద్వారా వివిధ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్,పెన్నులు, అందించడం అలాగే పదవ తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి కొంతవరకు రవాణా సదుపాయం కల్పించడం జరుగుతుంది అని అన్నారు. విద్యార్థులకు సహాయ సహకారాలను అశోక చక్రవర్తి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న ఫౌండేషన్ అధ్యక్షులు,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ నీ గ్రామస్తులు ,పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తయ్య,ఉపాధ్యాయులు, గ్రామ ఉపసర్పంచ్ మంగళపల్లి నారాయణ, మాజీ సర్పంచ్ గుర్రం సత్యనారాయణ, గ్రామ పెద్దలు లింగాల రామచంద్రయ్య,పసుల లింగయ్య, వార్డ్ నెంబర్లు చిర్ర శ్రీనాథ్,పసుల యాదగిరి,పసుల సుధాకర్,మొండికత్తి ఎల్లయ్య,జలగం గౌతమ్ ,యువ నాయకులు మొండి కత్తి పరశురాములు, మద్దెల మధు అనంతల విజయ్ వల్లపు మధుసుదన్,తదితరులు పాల్గొన్నారు



# రామన్నగూడ వాసి శ్రావణ్ కుమార్‌కు డాక్టరేట్

**చేవెళ్ల,తెలంగాణ చౌరస్తా:**

చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని రామన్నగూడ గ్రామానికి చెందిన పెద్దొళ్ల శ్రావణ్ కుమార్ తెలుగు విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించారు.ఈ విషయాన్ని బెనారస్ హిందూ యూనివర్సిటీ బుధవారం అధికారికంగా ప్రకటించింది.'భవానీ దేవి కథలు - మానవీయత' అనే పరిశోధనా అంశంపై శ్రావణ్ కుమార్ తన డాక్టరేట్ పూర్తి చేశారు. ఈ పరిశోధనను చల్ల శ్రీరామచంద్ర మూర్తి పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. పరిశోధనకు చీఫ్ ఎగ్జామినర్‌గా కాకతీయ విశ్వవిద్యాలయంకు చెందిన ప్రొఫెసర్ శ్రీదేవి వ్యవహరించారు. వైవా పరీక్ష అనంతరం డాక్టరేట్ పట్టా ప్రదానం చేయడానికి అంగీకారం తెలిపారు.అత్యున్నత విద్యా సాధన చేసిన శ్రావణ్ కుమార్‌ను పలువురు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.ఈ విజయానికి తన తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, అధ్యాపకుల సహకారం ఎంతో దోహదపడిందని శ్రావణ్ కుమార్ తెలిపారు.

# ఉద్యమకారులకు హామీలు అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు తీర్పును గౌరవించాలి
- తక్షణమే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి
- ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు గడ్డం యాదగిరి



**తెలంగాణ చౌరస్తా, నూతనకల్:**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు గడ్డం యాదగిరి పేర్కొన్నారు. బుదవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల హామీలను అమలు చేయాలని పేర్కొన్న హైకోర్టు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించాలని అన్నారు.తెలంగాణ ఉద్యమకాలంలోని పోరాటంలో దెబ్బలు తిని జైలుకు పోయి ఆర్థికంగా చితికిపోయిన వాళ్లలో ఉత్పత్తి శ్రామికకులాల వర్గాల వారేఎక్కువ అని తెలిపారు.గత ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఏర్పడినప్పటికీ ఉద్యమకారులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేసి ఉద్యమకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కట్ట మల్లారెడ్డి,మద్దెల సురేందర్ పంతం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.








# శాతవాహన న్యాయ కళాశాలలో అవగాహన సదస్సు

- ప్రత్యేక నైపుణ్యాలే కీలకం.... జనతా రెడ్డి కంచర్ల
- నాణ్యమైన న్యాయవిద్య అందరికీ అవసరం...ఆచార్య ఉమేష్ కూమార్

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

శాతవాహన విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాల సెమినార్ హాల్లో అమెరికా న్యాయ రంగ అవకాశాలపై ప్రత్యేక అవగాహనా సదస్సు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో జరిగింది.ఈ సదస్సులో న్యాయ విద్యార్థులకు అమెరికాలో ఉపాధి,అవకాశాలపై అవగాహన కల్పిస్తూ "ఇంటర్నేషనల్ ఆపర్చునిటీస్ ఇన్ లీగల్ సెక్టర్ స్పెసిఫిక్ టు యుఎస్ఏ అండ్ కరెంట్ ఇమిగ్రేషన్ ట్రెండ్స్ ఇన్ ట్రంప్ 2.0" అనే అంశంపై ముఖ్య అతిథిగా విచ్చేసిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అటర్నీ జనతా రెడ్డి కంచర్ల మాట్లాడుతూ.... ప్రత్యేక నైపుణ్యాలను పెంచుకున్నట్లయితే అమెరికాలో న్యాయ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని,లీగల్ కోడింగ్ తో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చాన్నారు.విద్యార్థులతో చర్చ కార్యక్రమం జరిపారు.ప్రత్యేక అతిధిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ...న్యాయ విద్యార్థులు క్రమశిక్షణతో చదువు పూర్తి చేసుకొని ఉన్నత విద్య కొరకు అమెరికా లాంటి దేశాలకు వెళ్లి తమ అవకాశాలు పెంచుకోవాలని తెలుపుతూ,న్యాయవిద్యకు మనదేశంలోనే గాక అమెరికాలో కూడా చాలా డిమాండ్ ఉన్నదని విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నారు.తెలంగాణ గ్లోబల్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి న్యాయ కళాశాల పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి బంగారు పతకం బహుకరించడం చాలా ఆనందంగా ఉన్నదని తెలియజేశారు. విశిష్ట అతిధిగా విచ్చేసిన రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ....ఒక దశాబ్ద కాలంగా అమెరికాలో విద్యావకాశాలు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వాటిపై ప్రత్యేక అవగాహనతో మరిన్ని అవకాశాలను గ్రామీణ ప్రాంత విద్యార్థులు చేజిక్కించుకోవచ్చు అని ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల ఎంతో ఉపయోగకరమవుతుందని ముఖ్యంగా న్యాయ విద్యార్థులకు ఇది ఎంతో మేలు కలుగుతుందన్నారు.అమెరికాలోని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.....తెలంగాణ ఏర్పాటు నుండి అమెరికాకు వివిధ ఉపాధి అవకాశాల కోసం వచ్చే అభ్యర్థులకు ఉచిత సలహాలు సహకారము అందిస్తున్నామని తెలంగాణ వాసు అయినందుకు కరీంనగర్ గడ్డ రుణం తీర్చుకునేందుకు ఇది ఒక అవకాశం అని అమెరికాలో తెలంగాణ వారికి ఎలాంటి సహాయ సహకారాలు అయినా తాను అందిస్తానని తెలుపుతూ న్యాయ అవకాశాల కొరకు తనని ఎప్పుడైనా సంప్రదించవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయశాఖ అధ్యాపకులు, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, కిమ్స్,జస్టిస్ కొమరయ్య, విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని అమెరికా అవకాశాలపై మెలకువలు పొందారు.






# మీ ప్రాణ రక్షణ కోసమే సీట్ బెల్ట్

- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్

**పెద్దపల్లి జిల్లా, తెలంగాణ చౌరస్తా:**

రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో అరైవ్ అలైవ్ రెండో విడుత కార్యక్రమంలో భాగంగా వాహనదారులందరూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని హెచ్చరించిన పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు ,పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో పోలీస్ అధికారులు సిబ్బందితో విస్తృతంగా సీట్ బెల్ట్ వినియోగం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి,ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని,రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా సీట్ బెల్ట్ ధరించకపోవడం వలన ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని,తమ విలువైన ప్రాణాలను కోల్పోవడం జరిగిందని, కావున తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవడానికి డ్రైవింగ్ సమయంలో సీట్ బెల్ట్ చాలా అవసరమని,ఫోర్ వీలర్స్ వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలియజేస్తు అవగాహన కల్పించారు.

# వ్యవసాయ శాఖలో సస్పెన్షన్ కలకలం

- పెద్దపల్లి మండల వ్యవసాయాధికారిణిపై వేటు

**పెద్దపల్లి జిల్లా,తెలంగాణ చౌరస్తా:**

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన ఆకస్మిక తనిఖీల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది.దీంతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారిణి కే.అలివేణిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఫిబ్రవరి 24న జరిగిన తనిఖీల ఆధారంగా క్రమశిక్షణ చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ,అనుమతి లేకుండా మండల కేంద్రాన్ని విడిచి



వెళ్లరాదని ఉత్తర్వుల్లో ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాలతో మరొమారు పెద్దపల్లి వార్తల్లో నిలిచింది. వ్యవసాయ శాఖలో కలకలం చోటుచేసుకుంది.

# 14వ వార్డు సమస్యల పరిష్కారించాలి

- కౌన్సిలర్ డాక్టర్ భూక్య ఉదయజ్యోతి

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నెలకొన్న పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆ వార్డు కౌన్సిలర్ డాక్టర్ భూక్య ఉదయజ్యోతి మున్సిపల్ కమిషనర్ బి. నాగరాజ్ కి రాతపూర్వక వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని ప్రశాంతి నగర్‌లో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సిద్ధంగా ఉన్నప్పటికీ, అది ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కాలనీవాసులకు మంచినీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఆ ట్యాంక్‌ను వినియోగంలోకి తెచ్చి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. వార్డులో ప్రధాన వీధి దీపాలు వెలగకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ప్రజలు, ముఖ్యంగా మహిళలు చిన్న పిల్లలు రాకపోకలు సాగించడానికి తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని, దీని




వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వార్డులోని అంతర్గత రోడ్లు పూర్తిగా పాడైపోయాయని, ప్రజల సౌకర్యార్థం వెంటనే కొత్తగా సి.సి. రోడ్లు నిర్మించాలని విన్నవించారు. వార్డు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, యుద్ధ ప్రాతిపదికన ఈ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలని, లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రతినిధులు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# విద్యార్థులు విద్యకు పెద్దపీట వేయాలి

- అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి

**నేలకొండపల్లి, తెలంగాణ చౌరస్తా:**


నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.విద్యార్థులు విద్యకు పెద్దపీట వేయాలని,విద్యకు సముచిత స్థానం కల్పించాలని ,విద్యను పెంచి పోషించుకోవాలని తెలియజేశారు. మంచి జ్ఞాపకశక్తితో బాగా చదువుకొని ప్రతి ఒక్క విద్యార్థి ఎదగాలన్నారు.సమయం యొక్క విలువ తెలుసుకొని ప్రతి విద్యార్థి మసులుకోవాలన్నారు. విద్య ద్వారానే రాష్ట్ర ఎల్లలు దేశ ఎల్లలు దాటవచ్చు అని తెలియజేశారు.విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు,పెద్దలు కాకుమాని మల్లికార్జున్ చౌదరి,తోటి ఉపాధ్యాయులు దేశబోయిన సైదులు,బాలు,ఇతర ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# అంతరిస్తున్న ఉమ్మడి కుటుంబాలు

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం అంటే భద్రత, ధైర్యం, ఆనందం, పంచుకోవడం, సహకారం, సంస్కారం. ఇంట్లో పెద్దలు మార్గదర్శకులుగా ఉండడం, చిన్నవారికి జీవితమార్గం అయ్యేది కష్టం వచ్చినా ఒంటరితనం తెలియదు "మేమున్నాం" అనే బలమైన ధైర్యం ఉండేది. నేడు సాంకేతిక అభివృద్ధితో మనిషి దగ్గరవ్వాల్సిన బదులు మరింత దూరమవుతున్నాడు. సౌకర్యం పెరిగింది, సంస్కారం తగ్గింది. స్వేచ్ఛ పెరిగింది, బాధ్యత తగ్గింది. సంబంధాలు ఉన్నాయి, అనుబంధం లేదు. నేను, నా కుటుంబం అనే సంకుచిత భావన మన కుటుంబం, మన బంధాలు అనే విశాల దృష్టిని మింగేసింది. మనిషిలో పెరిగిన ఈర్ష్యాద్వేషాల వలననే ఉమ్మడి కుటుంబాలు అంతరిస్తున్నాయి, రేపటి తరాలు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి అని పుస్తకాలలో మాత్రమే చదువుకుంటారు. ఒకప్పుడు మన కుటుంబం, మన బంధువులు అనేవాళ్లు. ఇప్పుడు నా కుటుంబం, నా పిల్లలు అంటున్నారు, రేపటి రోజులో ఎవ్వరికి వాళ్లే, భార్య మాట వినని భర్త, భర్త మాట వినని భార్య, తల్లిదండ్రుల మాట వినని పిల్లలు. ఉమ్మడి కుటుంబంలో ఒకరికి కష్టం వచ్చినా, ఆపద కలిగినా, మరేదైనా విపత్కర పరిస్థితి ఎదురైనా అందరు ఒక్కటిగా ఉండి భరోసా నింపేవాళ్లు, మేము ఉన్నాము అనే ధైర్యాన్ని అందించేవాళ్ళు, ఒకప్పుడు గోడలు చిన్నవైనా మనసులు ఆకాశంలా విస్తారంగా ఉండేవి. నేడు గోడలు ఆకాశాన్ని తాకుతున్నా మనసులు సంకుచితమై, తలుపులు మూసుకున్నాయి, హృదయాలు తాళం వేసుకున్నాయి. ఒక్కప్పుడు మాటలు మిఠాయిలా ఉండేవి, నవ్వులు దీపాల్లా వెలిగేవి, కలిసి తిన్న అన్నంలో అనుబంధ రుచి ఉండేది. నేడు ఆధునిక సౌకర్యాల మధ్య ఒంటరితనం, నిశ్శబ్దం, దూరం పెరిగింది. ఇల్లు పెద్దదయ్యింది కుటుంబం చిన్నదయ్యింది.



ఆధునిక సౌకర్యాలు పెరిగాయి, అనుబంధాలు తగ్గాయి. ఒకప్పుడు పండుగలకి ఇల్లు కిక్కిరిసేది ఇప్పుడు ఫంక్షన్లకు అన్ని అద్దెకు తెచ్చుకొనే కానించేస్తునారు, మేమున్నాం అనే ధైర్యం ఉండేది అనే పరిస్థితి నుంచి నాకు సంబంధం లేదు అనే స్థాయికి వచ్చేశారు. రక్తసంబంధం ఎక్కడ ఉన్నా రక్తసంబంధమే కానీ మనస్సులే బలహీన పడ్డాయి, కుటుంబం కూలిపోవడానికి కారణం కాలం ఎంతమాత్రం కాదు, మనిషిలో పెరిగిన 'నేను' అనే అహంకారమే ఉమ్మడి కుటుంబాలు అంతరించడానికి. పర్యవసానంగా ఒంటరితనం, విభేదాలు, అసంతృప్తి, భావోద్వేగ శూన్యత. విపరీతధోరణిలు, విపరీతమైన ఆలోచనలు తగ్గించుకుంటే ఉమ్మడి కుటుంబాల వ్యవస్థకు పునరుజ్జీవనం కలిపించవచ్చు. నేను అనే నుంచి మనం అలవాటు నుంచే మొదలవ్వాలి. పెద్దలను గౌరవించడం చిన్నలతో ఓర్పుగా వ్యవహరించడం, ఉన్నది పంచుకోవడం అలవాటు చేయడం, మాటలకంటే మనసుతో మెలగడం ముఖ్యంగా "నా బాధ్యత" అనే భావన పెంచడం, ఇవన్నీ మనం తిరిగి అలవాటు చేసుకుంటే ఉమ్మడి కుటుంబాల విలువ తిరిగి వెలుగులోకి వస్తుంది.



డాక్టర్. వై. సంజీవ కుమార్,
స్కై ఫౌండేషన్,
9393613555

# విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందిద్దాం

- బెలూన్ కార్ ఛాలెంజ్ యాక్టివిటీతో ఉపాధ్యాయుల్లో స్ఫూర్తి
- ఎంఈఓ కట్టా రవీంద్ర చారి.



**సైదాపూర్, తెలంగాణ చౌరస్తా:** పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాల ద్వారా పిల్లల్లో స్ఫూర్తి నింపాలని మండల విద్యాధికారి కట్టా రవీంద్ర చారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెన్కేపల్లి యందు మండలంలోని ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు బెలూన్ కార్ యాక్టివిటీ పై అవగాహన కల్పించారు.గౌరవ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారి చొరువతో పాఠశాలల్లో బెలూన్ కార్ యాక్టివిటీ పై మరింత అవగాహన పెంచేలా కృషి జరుగుతుందన్నారు.పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని ఆలోచించే వైఖరిని ఉపాధ్యాయులు పెంపొందించాలని వారు పేర్కొన్నారు. ప్రయోగాత్మక విధానం ద్వారా పిల్లలు త్వరగా నేర్చుకుంటారని ఎక్కువ కాలం వారి మెదళ్ళలో అవి నిలిచిపోతాయని పాఠశాలల్లో ప్రయోగశాలలను మరింత మెరుగుపరచాలని వారన్నారు.రాబోయే సైన్స్ డే రోజున పిల్లలకు వివిధ అంశాలలో పోటీ నిర్వహించాలని, హుస్నాబాద్ నియోజకవర్గంలో సైదాపూర్ మండలం సైన్స్ అంశాలలో ముందంజలో ఉండేలా చూడాలని వారు పేర్కొన్నారు కార్యక్రమంలో మండలంలోని సైన్స్ ఉపాధ్యాయులు అందరూ బెలూన్ కార్ యాక్టివిటీ లో పాల్గొని అనేక అంశాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.ఈ ఆక్టివిటీ ద్వారా అనేక విషయాలు పిల్లలకు అవగాహన కల్పించవచ్చని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సిఆర్పిలు సోయం రమేష్ , ఐఇఆర్పి వెంకటేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏఐఎఫ్‌బి పార్టీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్




**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి ప్రకటించారు. ఈ నియామకం తక్షణ అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతం లక్ష్యంగా నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. మండల, పట్టణ, గ్రామ స్థాయి కమిటీలను సమన్వయం చేసి పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని శ్రీనివాస్‌కు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ప్రభుత్వ విధానాలపై స్పందన వంటి అంశాల్లో చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. సుభాష్ చంద్ర బోస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ జిల్లాలో సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. కొలిపాక శ్రీనివాస్ నాయకత్వంలో పెద్దపల్లి జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.




## వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్లో నిధులు పెంచాలి

- ఎన్.పి.ఆర్.డి ఆధ్వర్యంలో ఏఓ శ్రీధర్ కు వినతిపత్రం అందజేత
- జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ,ప్రధాన కార్యదర్శి కాశప్ప

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల పెన్షన్ రూ.6000/లకు పెంచాలని, ఎంపిక అయిన లబ్ధిదారులకు పరికరాలు పంపిణి చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్.పి.ఆర్.డి) నారాయణపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ,ప్రధాన కార్యదర్శి కాశప్పలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పడి 26 నెలలు పూర్తి అయినా పెన్షన్ పెంపుకోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉన్నదని,పెన్షన్ పెంపుకోసం 202627 బడ్జెట్లో నిధుల కెటాయింపులు పెంచాలని,2023 డిసెంబర్ నుండి కొత్త పెన్షన్ కోసం నారాయణపేట జిల్లా వికలాంగులు దాదాపుగా 10వేల మంది లబ్ధిదారులు ఎదురుచుస్తూన్నారని,జిల్లాలో సహాయ పరికరాల లబ్ధిదారుల ఎంపిక జరిగి సంవత్సరం అవుతున్నా నేటికి పరికరాలు పంపిణి చెయ్యలేదు.తక్షణమే పరికరాలు పంపిణి చేయడానికి చర్యలు తీసుకోవాలని,అలాగే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పతకం కొనసాగించాలన్నారు.ప్రతి గ్రామంలోని వికలాంగులకు జాబ్ కార్డ్స్ జారీ చేసి ఉపాధి హామి పథకంలో పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా మార్చలన్నారు.ఈ కార్యక్రమంలో వి.బసవరాజ్,ఎండీ కథల్, శ్రీనివాసులు,మల్లప్ప,పి.శ్రీనివాస్,హనుమంత్,పెంటయ్య,కే.రాములు, కె.గోవిందు,తిప్పయ్య,సంజుకుమార్,లక్ష్మణ్,ఉమేరా,నారమ్మ,రవీంద్రమ్మ,లతా పాల్గొన్నారు.




## కలిసి పనిచేద్దాం..

- పెద్దపల్లిని మరింత సుందరంగా తీర్చిదిద్దుదాం.
- అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం
- బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య
- చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే విజయరమణారావు

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :** అందరి సహకారంతో కలిసి పనిచేసుకుంటూ పెద్దపల్లి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య అన్నారు.బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయ రమణారావు సమక్షంలో చైర్మన్ గా బాధ్యతలను స్వీకరించారు. ముందుగా చైర్మన్ చాంబర్‌లో వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు సమక్షంలో తన పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపి, చైర్మన్, పాలకవర్గం కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య మాట్లాడుతూ... పట్టణ ప్రజలు ఆదరించి ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను అప్పగించిన విజన్నకు రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పట్టణంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టి పెరిగాను. ఇక్కడి రోడ్ల మీద నడిచాను, కంచెర బావి నీళ్లు తాగి పెరిగినవాడినని, ఇక్కడి సమస్యలను దగ్గరగా చూశానన్నారు. అందుకే ఈ పదవిని అధికారంగా కాకుండా, సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. పట్టణంలో ఇంకా చాలా మెరుగుపరచాల్సిన అంశాలు ఉన్నాయని వాటి అన్నిటిని అందరి సహకారంతో పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి శుభ్రమైన తాగునీరు, మంచి డ్రైనేజీ వ్యవస్థ, పక్కాగా తడి, పొడి చెత్త అమలు, రోడ్లు, వీధుల దీపాలు, పార్కుల అభివృద్ధి, మెరుగైన ఆరోగ్యం, విద్యా సౌకర్యాలు, యువతకు ఉపాధి అవకాశాలు, స్వచ్ఛతకు పెద్ద పీట వేస్తా అన్నారు. ప్రజల నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని, పారదర్శకంగా, నిజాయితీగా, పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా పనిచేస్తానని మాట ఇస్తున్నానని తెలిపారు. బాధ్యతలను స్వీకరించిన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ను తోటి కౌన్సిలర్లు, అధికారులు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సులో గీతం అధ్యాపకుడికి ఉత్తమ పత్ర అవార్డు



**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా :** గీతం అధ్యాపకుల కృషి మరోసారి విద్యారంగ నిపుణుల ప్రశంసలను అందుకుంది. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. శ్రీధర్ ఫైనాన్స్ ట్రాక్ లో మొదటి స్థానం పొంది, ఉత్తమ పత్ర అవార్డును గెలుచుకున్నారు. బెంగళూరులోని క్రైస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన వ్యాపార ఆవిష్కరణ, పరివర్తనపై అంతర్జాతీయ సమావేశం (ICFBIT 2026)లో ఆయన ఈ ప్రశంసలందుకున్నారు. 'స్థిరమైన పరివర్తన, ఆర్థిక మార్కెట్లు: పర్యావరణ హిత సాంకేతిక సంస్థలలో ఐబీసీ పాత్ర' అనే శీర్షికన డాక్టర్ శ్రీధర్ సమర్పించిన పరిశోధనా పత్రం సమీక్ష మండలి మన్ననలను చూరగొంది. ఇది ఎంతో వాస్తవికంగా, లోతైన పరిశోధనతో, చక్కని భావ ప్రకటనలో ఎంతో స్పష్టంగా ఉందని ప్రశంసించింది. సదస్సు నిర్వాహక కమిటీ కూడా ఈ పత్రం విద్యాపరంగా అభిప్రాయాలను సూటిగా వెల్లడించిందని, సమావేశ ఇతివృత్తానికి సంబంధించిన ఔచిత్యానికి అనుగుణంగా ఉందని పేర్కొంది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తాతో సహా గీతం నాయకత్వం ఈ విజయాన్ని సాధించిన డాక్టర్ శ్రీధర్ ను అభినందించింది. ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగించమని ఆయనను ప్రోత్సహించింది.గీతంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం..హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకున్నారు.వందేమాతరం పూర్తి గీతాన్ని సామూహికంగా పాడారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రేరేపించిన, జాతీయ ఐక్యత, మాతృభూమి పట్ల భక్తికి ప్రతీకగా నిలిచిన జనాదరణ పొందిన కూర్పుకు ఈ కార్యక్రమం ద్వారా నివాళులర్పించారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన దేశవ్యాప్త ఉత్సవాలలో భాగంగా ఈ వేడుకలను నవంబర్ 2025 నుంచి నవంబర్ 2026 వరకు ఏడాది పొడవునా జాతీయ గీతం స్మారకోత్సవం నిర్వహిస్తున్న విషయం విదితమే. భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం, దేశభక్తి పట్ల తమ గౌరవాన్ని పునరుద్ఘాటిస్తూ గీతం అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.




## సమాజ సేవతోనే సంతృప్తి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 'పది' విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా :** సమాజ సేవతోనే సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమని ఆయన చెప్పారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని.. సంపూర్ణ విశ్వాసంతో పరీక్షలు రాయాలని కోరారు. గత దశబ్ద కాలంగా నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు.. సొంత నిధులతో పరీక్ష సామాగ్రి తో పాటు మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు కృష్ణ, గోపాల్, ఉపేందర్ రెడ్డి, రాములు, బిజేపీ రాజు, నాయకులు శ్రీకాంత్, దాసు, చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్, యాదగిరి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సోమ్లు నాయక్, క్షత్రియ యూత్ ఫెడరేషన్ ప్రతినిధులు రాజు, ప్రశాంత్ వర్మ, రాము, రామరాజు, కె.వి.ఎస్.ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ముక్కెర యాకన్నకు డాక్టరేట్



**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:** తొర్రూరు మండలం వెలికట్టే గ్రామానికి చెందిన ముక్కెర యాకన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం యూనివర్సిటీ విభాగం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. చరిత్ర విభాగంలో '' ల్యాండ్ కాస్ట్ అండ్ పవర్ ఆఫ్ తెలంగాణ'' అంశంపై డాక్టర్ ఎస్. అంజయ్య పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు గాను యూనివర్సిటీ విభాగం గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ముక్కెర యాకన్న దంతాలపల్లి హైస్కూల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నాడు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా యాకన్న ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, అభినందించారు.



## ప్రణాళికతో నూతన కాలనీల అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా :** పటాన్ చెరు డివిజన్ పరిధిలోని నూతన కాలనీల అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని నందన్ ప్యారడైజ్ కాలనీలో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పటాన్ చెరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు




## అంబేద్కర్ వెల్ఫర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**శేరిలింగంపల్లి,తెలంగాణ చౌరస్తా:** డి.సంజీవయ్య కాలనీలోని డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్ఫర్ అసోసియేషన్ పాత కమిటీని రద్దు చేస్తూ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని కలమూరి శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం డి.సంజీవయ్య కాలనీలోని జరిగిన కమిటీ సమావేశంలో సభ్యుల పేర్లను వెల్లడించారు. నూతన కమిటీలో కలమూరి శ్రీనివాస్ రావు, సత్యనారాయణ, మధుసూదన రావు, మధు మోహన్, కుమార్, యాదగిరి, మహేందర్, మల్లేష్ లు కమిటీలో సభ్యులుగా ఏర్పడినారు. మార్చి ఒకటవ తేదీన పూరి స్థాయి కమిటీని నియమించనున్నట్లు పేర్కొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

- బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వేపు రాములు



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** నారాయణపేట మండలం,అప్పక్పల్లి టు కోట కొండ,కోయిలకొండ వరకు బిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ రోడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో బోయిలపల్లి నుండి బొమ్మన్ పాడు వరకు ప్రజలు ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుందని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేపుర్ రాములు మాట్లాడుతూ రోజు వందల మంది ప్రయాణికులు,10 గ్రామాల ప్రజలు నారాయణపేట జిల్లా కేంద్రానికి వాహనాల మీద వెళ్తుంటారు.యాక్సిడెంట్లు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.రోజువారి నడుపుకునే ఆటోల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.కాబట్టి జిల్లా కలెక్టర్,స్థానిక ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణం పూర్తిగా చేపట్టాలని, లేకపోతే ప్రజలను కలుపుకొని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. అలాగే కోటకొండ పెద్ద చెరువు దగ్గర ఉన్న బ్రిడ్జి కూడా ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉన్నది.కావున బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టాలని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



## సోమయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని,ఝాన్సీ రెడ్డిలు

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:** ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,6వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పెద్దగాని కళావతి సోమన్నను గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి లు సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా సోమన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వైద్యుల సూచనలు కచ్చితంగా పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా పూర్తిగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ మీకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. వారి వెంట తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్,10వ వార్డు కౌన్సిలర్ ముధసాని సురేష్,కాంగ్రెస్ నాయకులు గంజి విజయపల్ రెడ్డి,మహబూబ్ రెడ్డి, గుండాల నరసయ్య,బిక్షం గౌడ్, వెంకన్న యాదవ్, దేవేందర్ రెడ్డి, బుచ్చి రాములు,ఎర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌరస్తా



# ఇంకో ఆరు నెలల బ్యాలెన్స్

'వారణాసి' సినిమా గురించి దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి రూపొందిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం జార్జియాలో షూటింగ్‌ను జరుపుకుంటున్నది. తాజాగా ఈ సినిమా కాన్సెప్ట్ గురించి చిత్ర కథానాయిక ప్రియాంక చోప్రా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్' ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న ఆమె 'వారణాసి' గురించి మాట్లాడింది. 'ఇదొక విజువల్ వండర్. కాలంతో పాటు ప్రయాణం చేస్తూ ప్రపంచాన్ని దర్శిస్తాం.ఈ కథలోని సాహసాలు మిమ్మల్ని అబ్బురపరుస్తాయి. మొత్తంగా గొప్ప సాహస ప్రయాణమిది. ఇప్పటికే 14 నెలలు షూటింగ్ చేశాం. మరో ఆరు నెలల షూటింగ్ బ్యాలెన్స్‌గా ఉంది' అని ప్రియాంక చోప్రా తెలిపింది. ఆమె మాటలతో సినిమా కాన్సెప్ట్‌పై మరింత స్పష్టత వచ్చిందని అభిమానులు అనుకుంటున్నారు. ఈ సినిమాలోని ఓ ఎపిసోడ్‌లో హీరో మహేష్‌బాబు.. శ్రీరాముడి పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా 'వారణాసి' ప్రేక్షకుల ముందుకురానుంది.



Published and Managing Director by Gaddam Shyam on behalf Mithra Publications, Published at 1-9-1113/1/B, Street No. 11, Vidyanagar, Hyderabad, Telangana-500044.
Editor: GADDAM SHYAM, RNINO. TELTEL12241, tcnewsweb@gmail.com